అలా వదిలేశారు!

కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధుల చొరవ లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గుర్రపుడెక్క, ముళ్లచెట్లు, పూడికతో నిండి ఉన్నాయి. ఇప్పటివరకు పూడిక తీసే పనులు మొదలు పెట్టకపోవడంతో నార్లు పోయాలా? వద్దా? అనే సందిగ్ధంలో రైతాంగం ఉంది. నార్లు పోస్తే నీరు సకాలంలో విడుదల చేస్తారో? లేదోనని సర్వేపల్లి రిజర్వాయర్ ఆయకట్టు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- పూడికతో నిండిన కాలువలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- మాటలకే కూటమి ప్రభుత్వం పరిమితం


సర్వేపల్లి రిజర్వాయర్ లోపలి భాగంలో తూముల వద్ద గుర్రపుడెక్క

వెంకటాచలం: నియోజకవర్గంలోని వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో వ్యవసాయానికి సంబంధించి సర్వేపల్లి రిజర్వాయర్ ఎంతో ముఖ్యమైంది. దీని నుంచి పంటలకు నీటిని విడుదల చేసే కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1.74 టీఎంసీలు (12 అడుగులు). కాగా ప్రస్తుతం 9 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఆయా మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలకు పైగా ఏటా రైతులు వరిసాగు చేస్తున్నారు. అక్టోబర్ ఆఖరి వారం వచ్చినా ఇంత వరకు అధికారులు రిజర్వాయర్ ఆయకట్టు పొలాలకు సాగునీరు విడుదల చేయాల్సిన కాలువల్లో పూడిక తొలగింపును చేపట్టలేదు. మొత్తం 12 తూముల ద్వారా కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంటే ఏ ఒక్క దాంట్లో నీరు ముందుకు పారే పరిస్థితి కనిపించడం లేదు. ప్రతి చోటా తుమ్మ చెట్లు, జమ్ము విపరీతంగా పెరిగి పూడిక నిండి ఉంది. మరికొన్ని రూపురేఖలే కనిపించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు విడుదల చేసినా చివరి ఆయకట్టు గ్రామాల్లోని పొలాలకు నీరు వెళ్లడం కష్టమేనని వాపోతున్నారు.

పట్టించుకోరా?

సర్వేపల్లి రిజర్వాయర్ ఆయకట్టు పొలాలకు సాగునీరు విడుదల చేసే కాలువల గురించి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ముందుగానే పూడిక తీయించి, నీటిని విడుదల చేసేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. రిజర్వాయర్‌లోనూ తూముల వద్ద గుర్రపుడెక్క చేరి సాగునీరు బయటకు విడుదలయ్యేందుకు ఆటంకంగా ఉంది. దానిని తొలగించకుంటే సాగునీరు సజావుగా ముందుకు సాగే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కాలువల్లో పూడిక తీయించి అన్నదాతలు సాగునీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

పూడికతో నిండిన కాలువ


పొదలకూరు: పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి గ్రామాల్లో సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల ద్వారా సుమారు 8 వేల ఎకరాల్లో వరిసాగు చేపడతారు. అయితే కాలువలకు నీటి విడుదల ప్రతి ఏడాది కొంత ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు పారక, సాగునీరు సరిపోక కొంత మేర పంటలు దెబ్బతింటున్నాయి. కాగా దక్షిణ కాలువ అక్కడక్కడా పూడికతో నిండి ఉంది. చేజర్ల మండలం చీర్లవారికండ్రిక – వావిలేరు మధ్య 50 నుంచి 52 కి.మీ వరకు పూడికతో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. నాచు పెరగడంతో కాలువకు నీటిని విడుదల చేసినా దిగువకు సాఫీగా సాగదంటున్నారు. కాలువ మరమ్మతులు చేపడుతున్న అధికారులు పూడిక తొలగింపు జోలికి వెళ్లేలా లేరని తెలిసింది. ముందస్తుగా పేరుకున్న పూడికను తొలగిస్తేనే చివరి ఆయకట్టు వరకు నీరందే అవకాశం ఉంటుంది. దీనికితోడు ఎగువ ప్రాంతం రైతులు కాలువ వద్ద వందల సంఖ్యలో విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని పారించుకుంటున్న నేపథ్యంలో దిగువకు నీరందాలంటే ప్రతి ఏడాది సమస్యగా మారుతోంది. అధికారులు అక్రమ మోటార్లను నియంత్రించడంలో వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా సాగునీరు రైతులందరికీ అందడం లేదని ప్రతి రబీలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి.

కాలువల్లో పూడిక తీయిస్తాం

సర్వేపల్లి రిజర్వాయర్ ఆయకట్టుకు సంబంధించి కాలువల్లో పూడిక ఉన్న మాట వాస్తవమే. ఇంకా ఐఏబీ సమావేశం నిర్వహించలేదు. అది జరిగాక కాలువల్లో పూడిక తీయించి నీటి విడుదల చేయిస్తాం.

– వేమారెడ్డి, ఇరిగేషన్ జేఈ

ఏటా ఇంతే..



దక్షిణ కాలువలో అక్కడక్కడా పేరుకున్న పూడికను తొలగిస్తే సాగునీరు సవ్యంగా పారుతుంది. ప్రతి రబీ సీజన్‌కు ఇవే సమస్యలు తలెత్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని కాలువలో పేరుకున్న నాచును తొలగించాలి. కాలువకు నీటిని విడుదల చేసే సమయంలో వాటర్ మేనేజ్మెంట్ చేపడితే రైతులందరికీ సాగునీరు అందుతుంది.

– ఎస్.బాలకొండారెడ్డి, రైతు, నావూరు


పుంజులూరుపాడులోని పొలాలకు సాగునీటిని విడుదల చేసే కాలువలో పూడిక


పొట్టింపాడు పొలాలకు సాగునీరు విడుదల చేసే కాలువను కమ్మేసిన ముళ్ల చెట్లు

క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన


శ్రావణిని అభినందిస్తున్న హెచ్‌ఎం

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బి.శ్రావణిని ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, పీడీ షేక్ షబీక, ఇతర ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25 నుంచి 27 తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో శ్రావణి నెల్లూరు జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చూపింది. ఈ జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. దీంతో ఆమెను అభినందించారు.

హౌసింగ్ ఏఈగా మహేష్



పొదలకూరు: హౌసింగ్ ఏఈగా ఎం.మహేష్ సాధారణ బదిలీల్లో భాగంగా కావలి డివిజన్ నుంచి మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం హౌసింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ శివమోహన్ వెంకటాచలం వెళ్లారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తామన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం


ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు: మండలంలోని మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అయోడిన్ ఉప్పుపై అవగాహన



కొడవలూరు: అయోడిన్ ఉప్పునే ప్రతి ఒక్కరూ వినియోగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ కోరారు. అయోడిన్ ఉప్పుపై మండలంలోని నార్తురాజుపాళెం సెక్టార్ అశోక్ నగర్‌లో గర్భిణులు, బాలింతలకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సాధారణ ఉప్పును వినియోగించడం ద్వారా హైపో థైరాయిడ్, గాయిటర్, కిడ్నీ వ్యాధులొచ్చే అవకాశం ఉందని చెప్పారు. వీఓఏ మొర్ల పార్వతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త అన్నం హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ కోసం పోరాటం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి


పోర్టు సీఈఓకి వినతిపత్రం అందజేస్తున్న సోమిరెడ్డి తదితరులు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ కోసం అవసరమైతే పోరాటం చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం అఖిలపక్షం నేతలతో కలిసి పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎగుమతి, దిగుమతులను కాటుపల్లి, ఎన్నూరు పోర్టులకు తరలించి, కాలుష్యం వెదజల్లే బొగ్గు, బూడిదను ఇక్కడి ప్రజలపై రుద్దడం సమంజసం కాదన్నారు. టెర్మినల్ తరలిపోవడం వల్ల రైతులు నష్టపోయారన్నారు. ఆయన వెంట బీజేపీ నేత ఆంజనేయరెడ్డి, సీఐటీయూ నేత మోహన్‌రావు, టీడీపీ నాయకులున్నారు.

అదుపుతప్పిన లారీ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో సురక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు ట్యాంకుల నిర్మాణానికి అవసరమయ్యే ఇనుప కమ్ములు తీసుకొస్తున్న లారీ అదుపుతప్పిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దీంతో నీటిపారుదల శాఖ భవన గేట్‌ను ఢీకొనడంతో ప్రహరీ ధ్వంసమైంది. కాగా ఘటనలో ఎవరూ గాయపడలేదు.

వినతిపత్రాల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి తహసీల్దార్ శివకృష్ణ అర్జీలను స్వీకరించారు. భూ వివాదాలకు సంబంధించిన వినతులను రైతులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

భారీ రాస్తారోకో



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో జనావాసాల మధ్య పందుల పెంపకాన్ని అంగీకరించబోమంటూ వందలాది మంది గిరిజనులు తదితరులు ముంబై జాతీయ రహదారిపై వైఎస్సార్ కూడలి వద్ద రాస్తారోకోను సోమవారం నిర్వహించారు. కౌన్సిలర్ వెంకటశివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఇలా చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఎస్సై సంతోష్‌రెడ్డి సూచించారు. కమిషనర్ వద్దకే వెళ్లి తేల్చుకుందామంటూ మహిళలు వెళ్లారు. మార్గమధ్యలో హెచ్‌పీ గ్యాస్ కూడలిలో కమిషనర్ రాకను గమనించి ఆయన్ను ఘెరావ్ చేశారు. దీంతో కమిషనర్‌తో వెంకటశివకుమార్‌రెడ్డి సంప్రదింపులు జరిపారు. వారిని మంగళవారం ఉదయం పది గంటల్లోపు ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఇతర అధికారులను సంప్రదించడంతో పాటు ఎమ్మెల్యే సూచన మేరకు వారికి ఎక్కడ నివాస స్థలాలను ఏర్పాటు చేయాలో నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు.

పరీక్ష కేంద్రాల్లో ఇన్‌చార్జి వీసీ తనిఖీలు


పరీక్ష కేంద్రంలో విజయభాస్కరరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. విడవలూరు, కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి వీసీ విజభాస్కరరావు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధ్యాపకులకు సూచించారు.

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

- ట్రూ అప్ చార్జీల పెంపుపై సీపీఎం ఆందోళన


ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

మనుబోలు: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దారుణమని సీపీఎం నాయకులు విమర్శించారు. ప్రభుత్వం కరెంట్ చార్జీల పెంపుదలకు పూనుకోవడంపై వారు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చాడన్నారు. వాటిని అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను దారిమళ్లించేందుకే తిరుమల లడ్డూ పేరుతో కొంతకాలం నాటకమాడారని దుయ్యబట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవదానం, వెంకటేశ్వర్లు, బీసీ భాస్కర్, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ


కొడవలూరు: విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సుజాత


విడవలూరులో..

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో గల వరి విత్తన దుకాణాలు, బుచ్చి – దాసరిపాళెం రోడ్డులోని విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్లను కోవూరు ఏడీఏ సుజాత సోమవారం తనిఖీ చేశారు. విత్తన విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లు, నిల్వలు, నాణ్యతను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి బ్యాగ్‌కు బిల్లులను విధిగా పొందాలని కోరారు. విత్తనాల్లో ఏదైనా లోపం ఉంటే వాటి ఆధారంగా బాధ్యులపై చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మార్కెట్లో కేఎన్నెమ్ – 1638, 733, ఆరెన్నార్ – 15048 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొలక కట్టాకే విత్తనాలను వినియోగించాలని సూచించారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: మండలంలోని దంపూరు, వావిళ్ల గ్రామాల్లో గల విత్తనాల షాపులను మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని సూచించారు. నాణ్యతలో లోపాలుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

స్వచ్ఛమైన తాగునీటిపై అవగాహన



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

కోవూరు: స్వచ్ఛమైన తాగునీటితోనే ఆరోగ్యం సాధ్యమని వెల్నెస్ శిక్షకుడు శేఖర్‌బాబు పేర్కొన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అనే అంశంపై కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సును మెకానికల్, ఎన్నెస్సెస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, డైరెక్టర్ సుబ్బారావు, మెకానికల్ విభాగాధిపతి పద్మశ్రావ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ భూముల కౌలు వేలాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. పెనుబల్లిలోని 6.51 సెంట్లకు వేలాన్ని నిర్వహించగా, మూడేళ్ల కాలపరిమితికి రూ.3,95,700 ఆదాయం వచ్చిందని తెలిపారు. దేవదాయ శాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలపై గ్రామసభలు

పొదలకూరు: మండలంలో రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో సభలను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 21 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో సమస్యలుంటే సభల ద్వారా తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సభలను నిర్వహించి సమస్యలను గుర్తించామన్నారు. మంగళవారం మరుపూరులో సభలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు హాజరై తమ సమస్యలను చెప్పాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

తోటపల్లిగూడూరు: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మండపం పంచాయతీ ఈదూరు పట్టపుపాళెంలో మత్స్యకారులకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. రూ.2.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటితో బోట్లు, ఇతర వేట సామగ్రి అందిస్తామన్నారు. నేతలు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను సద్వినియోగం చేసుకోండి

విడవలూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి మాట్లాడారు. క్యాంప్‌ను సోమవారం నుండి శనివారం వరకు నిర్వహించనున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయ ముట్టడి

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళికట్ట వాసులు సోమవారం ముట్టడించారు. పందుల పెంపకందారులకు తమ ప్రాంతంలో నివాస స్థలాలను ఇవ్వడాన్ని వారు వ్యతిరేకించారు. తమ నిరసనను కమిషనర్‌కు తెలియజేశామని, అయినా పందుల పెంపకందారులు తమ నివాసాల వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్లలోకి చొరబడి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లు వారికి సర్దిచెప్పేందుకు యత్నించినా, వినకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కాగా కాలనీ వాసులకు మద్దతుగా అధికార పార్టీ నేతలు రంగప్రవేశం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు మూడు గంటల పాటు ముట్టడించారు.

396 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 396 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 7,431 మంది విద్యార్థులకు 7,035 మంది హాజరు కాగా 396 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఎమ్మార్పీకే విత్తన విక్రయాలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ జహీర్

మనుబోలు: మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీఇందిరా సీడ్స్ దుకాణాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే అందజేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులను సరిచూసుకోవాలన్నారు. ఆర్బీకేల్లో 25 కేజీల బ్యాగ్‌ను రూ.125 సబ్సిడీతో అందజేస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పాసు పుస్తకం జెరాక్స్‌తో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న సికందర్

కోవూరు: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోవూరు టీఎస్సీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సికందర్ కోరారు. కళాశాల ఆవరణలో తల్లిదండ్రులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి పురోగతి, హాజరు శాతం తదితరాలపై చర్చించారు. రోజూ కళాశాలకు పంపితే, వారు ఉత్తీర్ణులయ్యేలా తాము తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితాను రూపొందించండి


సమావేశాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్

కొడవలూరు: నీటి సంఘాల ఎన్నికలు వచ్చే నెల్లో జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ స్ఫూర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సోమవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. మండలంలో 12 నీటి సంఘాలున్నాయని, ఆయకట్టు భూమి ఎవరి పేరుపై ఉందో వారి ఓట్లను నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. నీటి సంఘాల ఎన్నికలు ఎంతో కీలకమైన తరుణంలో ఎలాంటి తప్పుల్లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు. డీటీ సారంగపాణి, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాలూకా ప్రాంగణంలో రక్తదాన శిబిరం



కోవూరు: పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా స్థానిక తాలూకా ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ విజేత, ఎస్సై రంగనాథ్‌గౌడ్, వైద్యులు వెంకటచలపతిగౌడ్, సలావుద్దీన్, సామాజిక కార్యకర్త దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, ఏఎస్సై సత్యం తదితరులు పాల్గొన్నారు.

అనుమతులను విధిగా పొందాలి


మాట్లాడుతున్న నిర్మలానందబాబా

కోవూరు: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాలకు అనుమతులను తప్పక పొందాలని తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. దుకాణాలను ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కోవూరులో లైసెన్స్‌లు పొందిన వారు ఎనిమిది మంది అని, దుకాణాలను వీరే ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్‌ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పడుగుపాడులో రెవెన్యూ సదస్సు నేడు

కోవూరు: మండలంలోని పడుగుపాడులో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించనున్నామని తహసీల్దార్ నిర్మలానందబాబా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.